తెలుగు దినపత్రిక

jayabheridaily.com

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 01
సంచిక : 214
పేజీలు : 5
వెల : 4

మల్కాజిగిరి

శనివారం 16-03-2024




KISHAN COMPUTERS
SALES & SERVICE
Computers, Laptop Repair
Mother Board Repair,
Printers Repair,
Catrige Refilling,
New Catriges,
Ink Bottles, Accessories



Near MRO Office, Opp. Shamirpet Lake,
Shamirpet Mandal, Medchal Dist.
Cell: 80994 82143, 99488 05009


## మరి కొన్ని గంటల్లో

# ఎన్నికల షెడ్యూల్




**జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 15:**

ఎన్నికల షెడ్యూల్ విడుదలపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. ఈ మేరకు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ను శనివారం విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు దీనికి సంబంధించి ప్రెస్ మీట్ నిర్వహించనున్నట్లు ట్వీట్ చేసింది. లోక్ సభ ఎన్నికలతో పాటు ఏపీ సహా ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.కాగా, కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా సుఖ్బీర్ సింగ్ సంధు, జ్ఞానేశ్ కుమార్లను ఇటీవల నియమించగా.. వీరు శుక్రవారం ఉదయం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఈసీ వారికి అభినందనలు తెలియజేశారు. కాగా, ఇటీవల అరుణ్ గోయల్, అనూప్ చంద్ర పాండే రాజీనామాతో కమిషనర్ల పోస్టులు ఖాళీ అయ్యాయి. దీంతో ఎన్నికల కమిషనర్ల నియామకానికి కేంద్రం ప్రత్యేకంగా ఓ ప్యానెల్ని నియమించింది. అనంతరం ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో కేరళకు చెందిన జ్ఞానేశ్ కుమార్, పంజాబ్కి చెందిన సుఖ్బీర్ సింగ్ సంధుని ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆరుగురి పేర్ల పరిశీలన అనంతరం వీరిని ఎంపిక చేయగా.. వెను వెంటనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వీరి నియామకానికి ఆమోద ముద్ర వేశారు. లోక్సభతో పాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలను నిర్వహించేందుకు సంబంధించిన నోటిఫికేషన్ను శనివారం విడుదల చేసేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమైంది.. ఇటీవల దేశంలోని పలు రాష్ట్రాల్లో పర్యటించిన కేంద్ర ఎన్నికల సంఘం టీమ్ ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించింది. మొత్తం 7 విడతల్లో లోక్సభ ఎన్నికలను నిర్వహించేందుకు ఈసీ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. లోక్సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ పోల్స్ జరిగే అవకాశమున్న రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ ఉన్నాయి..



2లో

## ఈడి అక్కకు

# వేసింది బేడి

- ఢిల్లీ లిక్కర్ కేసులో.. కవిత ఇంట్లో సుమారు 4 గంటలపాటు సోదాలు
- ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన 10 మంది ఈడీ అధికారులు
- కీలకమైన పత్రాలను స్వాధీనం
- పలుమార్లు విచారణకు హాజరుకావాలని నోటీసులు
- ఎట్టకేలకు కల్వకుంట్ల కవిత చట్టానికి సిక్కింది...
- హైడ్రామాకు తెర పెట్టింది ఈడి..
- అక్క దగ్గర ఉన్న 16 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుంది ఈడి..
- పార్లమెంటు ఎన్నికలవేళ బిఆర్ఎస్ కి పెద్ద బిగ్ షాక్ తగిలింది...

గత కొంతకాలంగా దాగుడుమూతల ఆటల సాగుతున్న లిక్కర్ స్కామ్ కేసులో కల్వకుంట్ల కవిత ఈడి చేతికి చిక్కింది. ఇవాళ ఉదయం హైదరాబాదులోని ఆమె ఇంట్లో దాదాపు నాలుగు గంటల వరకు ఎమ్మెల్సీ కవితను విచారించారు. విచారణ అనంతరం పూర్తిగా రుజువు కాబడి కోర్టు ఆదేశాల ప్రకారం ఈ డి ఐ టి అధికారులు కవితకు అరెస్టు నోటీసును అందజేసి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా కవిత భర్త దగ్గర నుంచి కూడా డ్రైవరు సన్నిహితుల దగ్గర నుంచి పూర్తిగా అన్ని సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు అధికారులు. ఒకవైపు తెలంగాణ శాసనసభలో చావుతప్పి కన్ను లొట్టబోయిన బిఆర్ఎస్ పార్టీకి పార్లమెంటు ఎన్నికలు నేడో రేపు అనే నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే పార్టీని వీడుతున్న నేతలు చూసి ఒకపక్క చెమటలు పడుతున్న కేసీఆర్ కి అటు పార్టీకి దిక్కుతోచని పరిస్థితి దాపురించింది. దీంతో ప్రస్తుతం కెసిఆర్ తో ఉన్న నాయకులు కూడా ఆ పార్టీని వీడెందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే బిఆర్ఎస్ శ్రేణులు కవిత అరెస్టును నిరసిస్తూ పార్లమెంటు ఎలక్షన్ లో బిజెపి ఓడిపోతుందని అందుకే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని బిఆర్ఎస్ శ్రేణులు బగ్గుమంటున్నారు... ఎంతైనా నిప్పులేనిదే పొగరాదు కదా.... అవినీతి చెయ్యందే అక్క అరెస్టు కాదు..... మొత్తానికి పార్లమెంటు ఎన్నికలవేళ లిక్కర్ కేసు తెలంగాణ ప్రజలకు మంచి కిక్కు నిచ్చే వార్తనందించింది సిబిఐ ఈడి...

...మిగతాది 2 లో

## కర్నాటక మాజీ ముఖ్యమంత్రిపై లైంగిక

# వేధింపుల ఆరోపణలు

- పోక్సో యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు

**జయభేరి, బెంగళూరు మార్చ్ 15:**

బిజెపి సీనియర్ నేత, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో లోక్ సభ ఎన్నికల సమయంలో రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. 17 ఏళ్ల బాలికపై ఆయన లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులు రావడంతో యడియూరప్పపై పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. తనని మోసం చేశారని బాధితురాలు కుటుంబ సభ్యులు ఫిబ్రవరి 2న యడియూరప్పను కలిశారు. యడియూరప్ప తన కూతురును గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. నెల రోజుల తరువాత బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం పోలీసులు ఆయనపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆరోపణలపై ఇప్పటి వరకు యడియూరప్ప కానీ, ఆయన కుటుంబ సభ్యులు స్పందించలేదు. ఆయన కార్యాలయం ఈ ఆరోపణలను ఖండించింది. ఆ కుటుంబం ఇప్పటివరకు 53 ఫిర్యాదులు చేశారంటూ ఆ జాబితాను ఆయన కార్యాలయం పేర్కొంది. గతంలో పలువరిపై ఆరోపణలు చేశారని వివరించింది.



కర్నాటక రాష్ట్రానికి ఆయన నాలుగు సార్లు సిఎంగా సేవలందించారు. బిజెపి అధ్యక్షుడిగా రాష్ట్రానికి ఉన్నారు. బిజెపి అధిష్ఠానం ఆయన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి నుంచి తొలగించి ఆయన కుమారుడికి అప్పగించారు. ప్రస్తుతం ఆయన బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడిగా ఉన్నారు.

# కరప్షన్ కింగ్..

## నాగారం మున్సిపల్ కమిషనర్!?




- కాసులు కుమ్మరిస్తే యదేచ్ఛగా
- అక్రమ నిర్మాణాలు నిర్మించుకోవచ్చ..!?
- అదేంటని ప్రశ్నించిన అస్సలు పట్టించుకోరు..!?
- కళ్ళుండి చూడలేరు!? చెవులు ఉండి వినలేరు!?
- నోరు ఉండి మాట్లాడలేరు...!?
- మానం, మర్యాద, చదువు అన్ని గాలికి వదిలేసి
- కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు!
- రాజకీయ అండతోనే ఇదంతా జరుగుతోందని గుసగుసలు...
- అడిగే వాడెవడు!? పైన కింద తెల్ల వెంట్రుకలు వచ్చాయి...
- ఎవడు ఏం చేసుకుంటాడో చేసుకొనియ్....!?

2లో



## మహిపాల్ రెడ్డి సోదరుడు అరెస్ట్

**జయభేరి, హైదరాబాద్, మార్చి 15**

అక్రమ మైనింగ్ ఆరోపణలతో పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని లక్డారం గ్రామంలో సంతోష్ గ్రానైట్ మైనింగ్ పేరుతో ఆయన క్రషర్ కంపెనీలు నిర్వహిస్తున్నారు. పరిమితికి మించి గుట్టల్ని తవ్వేస్తున్నారని.. అనుమతుల గడువు ముగిసినా మైనింగ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మధుసూదన్ పై అక్రమ మైనింగ్, ఛీటింగ్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి.. క్రషర్లను సీజ్ చేశారు. అయితే, ఆయన్ను తరలిస్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకున్నారు. వారిని నిలువరించిన పోలీసులు మధుసూదన్ ను సంగారెడ్డి తరలించారు. ఆస్పత్రిలోకి వెళ్లేందుకు పార్టీ కార్యకర్తలు యత్నించగా ప్రధాన ద్వారం మూసేశారు. మధుసూదన్ అరెస్ట్ నేపథ్యంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. దేశం మొత్తంలో ఎన్నో క్వారీలున్నాయని.. పూర్తి అనుమతితోనే తమ క్వారీలు నడిపిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. 'ప్రజల మద్దతుతో కింది స్థాయి నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్నాం. నా సోదరున్ని అక్రమంగా అరెస్ట్ చేశారు. ఈ విషయంపై ప్రజా కోర్టులోనే తేల్చుకుంటాం.' అని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ లోకి దానం? సిఎం రేవంత్ తో భేటీ



**జయభేరి, హైదరాబాద్ మార్చ్ 15:**

గత డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంనుంచి గెలిచిన దానం నాగేందర్ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. దానం నేరుగా సిఎం ఇంటికి వెళ్లి ఆయనతో కాసేపు మాట్లాడి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడం ఖాయమనే వార్తలు గుప్పుమంటున్నాయి.గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై దానం ప్రశంసలు కురిపిస్తున్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో కష్టపడి పనిచేసి, ఆ పదవిని సాధించుకున్నారని గతంలో ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందనడం భావ్యం కాదని ఒక సందర్భంలో అన్నారు. ఇటీవల దానం మీడియాతో మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు రోజుకో పండుగ వస్తోందని ప్రశంసించారు. రేవంత్ సర్కార్ ఉద్యోగులకు అన్నీ శుభవార్తలే చెబుతోందని కామెంట్ చేశారు. దీనితో మరో ఎమ్మెల్యే బిఆర్ఎస్ చేతినుంచి జారిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## కవిత అరెస్ట్..

ఢిల్లీ లిక్కర్ స్కామ్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ అధికారులు అరెస్ట్ నోటీసులు ఇచ్చారు. ఆమెను అదుపులోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఉదయం నుంచి సోదాలు చేస్తున్న అధికారులు ఇంట్లో ఉన్న అందరి వద్ద ఫోన్లను ముందే సీజ్ చేశారు. బంజారాహిల్స్లోని రోడ్ నెంబర్ 3లో ఉన్న కవిత నివాసంలోనే ఉన్న ఈడీ అధికారులు ఆమెకు అరెస్ట్ వారంట్తో పాటు సెర్చ్ వారెంట్ ఇచ్చారు. దీనికి సంబంధించి కవితతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు నోటీసులిచ్చినట్టు తెలుస్తోంది. మధ్యాహ్నం నుంచి కవిత ఇంట్లో సోదాలు చేస్తున్నారు 12 మంది అధికారులు. ఇద్దరు మహిళా అధికార్లతోపాటు పదిమంది అధికారుల తనిఖీలు నిర్వహించారు. కవితను అరెస్ట్ చేస్తారన్న సమాచారం బయటకు రావడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున కవిత నివాసం వద్దకు తరలి వచ్చారు. బీజేపీ, మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బంజారాహిల్స్లోని కవిత నివాసంలో ఈడీ అధికారులతో కలిసి ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఢిల్లీ నుంచి వచ్చిన 12 మంది అధికారుల బృందం 4 టీంలుగా ఏర్పడి తనిఖీలు చేసినట్లు సమాచారం. ఇద్దరు మహిళా అధికారులతో సహా 10 మంది అధికారులు సోదాల్లో పాల్గొన్నారు. కవితతో పాటు ఆమె భర్త వ్యాపారాలపైనా ఈడీ అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇంట్లోకి ఎవరినీ అనుమతించడం లేదు. ఈ క్రమంలో కవిత రెండు ఫోన్లను అధికారులు సీజ్ చేశారు. ఆమె స్టేట్ మెంట్ ను రికార్డు చేసినట్లు సమాచారం.ఢిల్లీ లిక్కర్ కేసులో ఏడాది గ్యాప్ తర్వాత ఎమ్మెల్సీ కవితకు ఫిబ్రవరి నెలలో సీబీఐ నోటీసులు ఇచ్చింది. 2022 డిసెంబర్లో కవిత నివాసంలోనే స్టేట్మెంట్ తీసుకున్న సీబీఐ.. గత ఫిబ్రవరి 26న ఢిల్లీకి రావాలని, తమ ఎదుట విచారణకు రావాలంటూ నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో కవితను నిందితురాలిగా చేర్చి 41A కింద నోటీసులు ఇచ్చింది సీబీఐ. లిక్కర్ కేసులో కీలక నిందితులు అప్రూవర్లుగా మారడంతో.. వారి స్టేట్మెంట్స్ ఆధారంగా కవితకు నోటీసులు జారీ చేసింది సీబీఐ. ఇదే కేసులో ఇప్పటికే కవితను ఈడీ కూడా విచారించింది.ఈడీ సోదాలపై కవిత లాయర్ సోమా భరత్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వచ్చే వరకు ఎలాంటి చర్యలు ఉండవన్న ఈడీ.. సోదాలు చేయడం సరికాదన్నారు. కోర్టులో కేసు ఉండగా సడెన్గా ఎందుకీ సోదాలని ఆయన ప్రశ్నించారు. మరోవైపు బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున కవిత ఇంటికి చేరుకుంటున్నారు. ఈడీ దాడులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణుల ధర్నాకు దిగారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.2022 జులైలో ఢిల్లీ లిక్కర్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. దాదాపు 5 నెలల తర్వాత మొదటిసారిగా 2022 డిసెంబర్ 11న కవితను ఇంట్లోనే విచారించింది CBI. లిక్కర్ స్కామ్లో CRPC 160 కింద 7 గంటల పాటు ప్రశ్నించారు సీబీఐ అధికారులు. ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి సౌత్ గ్రూప్కు కవిత నేతృత్వం వహించారనేది ప్రధాన ఆరోపణ.2022 మార్చి 11న మొదటిసారిగా ఈడీ విచారణకు హాజరైయ్యారు కవిత. ఆ తర్వాత 16, 20, 21 తేదీల్లో కూడా ఢిల్లీలో కవితను విచారించారు ఈడీ అధికారులు. ఆ సమయంలోనే తన 8 ఫోన్లను ఈడీ అధికారులకు అందజేశారు కవిత. ఆ తర్వాత ఛార్జ్షీట్లో కవిత పేరును ప్రస్తావించింది ఈడీ, సీబీఐ. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ 50 కింద ఈడీ స్టేట్మెంట్ రికార్డ్ చేసింది. జనవరి 5న కవితకు మళ్లీ ఈడీ నోటీసులు ఇచ్చింది.అయితే మహిళలను ఈడీ కార్యాలయానికి పిలిచి ప్రశ్నించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు కవిత. తనపై ఎలాంటి బలవంతపు చర్యలను ఈడీ తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్లో కవిత కోరారు. ఈ పిటిషన్ను ఇవాళ విచారించిన సుప్రీంకోర్టు ఈ నెల 19కి వాయిదా వేసింది.ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో గత నెల 21న కవితకు CBI సమన్లు జారీ చేసింది. గత నెల 26న వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ కేసులో కవితను నిందితురాలిగా చేర్చి 41A కింద నోటీసులు ఇచ్చింది సీబీఐ. సుప్రీం కోర్టులో కేసు విచారణ ఉండగా.. తాను విచారణకు రాలేనని సీబీఐకి లేఖ రాశారు కవిత.ఇప్పటివరకు ఈ కేసులో దినేష్ ఆరోరా, గోరుంట్ల బుచ్చి బాబు, అరుణ్ రామచంద్ర పిళ్ళై, మాగుంట రాఘవ అప్రూవర్లుగా మారారు. ఇదే కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను అరెస్ట్ ఈడీ చేసింది.


## ఆర్థిక మూలాలు దెబ్బతీసేస్తున్నారా...



✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 15 :

రేవంత్ రెడ్డి దూకుడు ఆగడం లేదు.. కెసిఆర్ మూలాలను, కెసిఆర్ ఆర్థిక స్తంభాలను సమూలంగా పెకిలించే పనిలోపడ్డాడు. ఇప్పటికే ప్రణీత్ రావును అరెస్టు చేసి ఎవరెవరి ఫోన్లు ట్యాంపరింగ్ చేశారు? దీని వెనుక ఉన్నది ఎవరు? ఎవరు చేయమంటే చేశారు? అనే కోణంలో తీగలాగుతున్నాడు. అక్రమంగా సంపాదించిన ఆస్తులను పడగొడుతున్నాడు.. ఇప్పుడు కెసిఆర్ ఆర్థిక స్తంభమైన మై హోమ్ మీద పడ్డాడు. ఈ సంస్థ భూదాన్ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై శివకాశి నోటీసులు భూదాన్ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై శివకాశి నోటీసులు జారీ భూదాన్ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై రేవంత్ దృష్టి సారించాడు.హైదరాబాద్ నగర శివారులో భూదాన్ భూములను మై హోమ్ ఆక్రమించిందనేది ప్రభుత్వ వాదన. గత ప్రభుత్వం ఈ భూములను మై హోమ్ కంపెనీకి ధారా దత్తం చేసిందని రేవంత్ వద్ద స్పష్టమైన సమాచారం ఉందని వినికిడి. అందులో భాగంగానే రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ద్వారా మై హోం కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. 150 ఎకరాల భూదాన్ భూముల్లో జూపల్లి రామేశ్వరరావుకు చెందిన మై హోమ్ కంపెనీ అక్రమంగా నిర్మాణాలు చేపట్టిందని.. వాటిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వం నోటీస్ జారీ చేసింది. దీంతో ఒక్కసారిగా కలకలం నెలకొంది. వాస్తవానికి రేవంత్ రెడ్డికి, మై హోమ్ జూపల్లి రామేశ్వరరావుకు ఎక్కడ చెడిందో గాని.. ఇద్దరి మధ్య చాలా గ్యాప్ ఉంది. అప్పట్లో రామేశ్వరరావు తో పడిన గొడవ వల్లే కెసిఆర్ రేవంత్ రెడ్డికి ఘర్షణ మొదలైందని రాజకీయ వర్గాలు అంటుంటాయి. ఆ ఘర్షణ కాస్త చినికి చినికి గాలి వాన లాగా మారి ఇక్కడ దాకా తీసుకొచ్చిందని చెబుతుంటాయి.సో, అందువల్లే రేవంత్ మై హోమ్ జూపల్లి రామేశ్వరరావు వ్యాపారాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సానుకూలమైన స్పందన రాకుంటే ఆ భూదాన్ భూముల్లో నిర్మించిన భవనాలను ప్రభుత్వం పడగొట్టే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై మై హోమ్ కోర్టుకు వెళ్లినప్పటికీ ఉపశమనం లభించదని, ఎందుకంటే ప్రభుత్వం వద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ ఈ నిర్మాణాలను రేవంత్ పడగొట్టి, భూములను స్వాధీనం చేసుకుంటే మాత్రం ఒక చరిత్రే అవుతుంది. బిజెపి సెంట్రల్ నాయకులతో మంచి సంబంధాలు మెయింటైన్ చేస్తున్న జూపల్లి రామేశ్వరరావు.. తన సమస్యను అక్కడిదాకా తీసుకు రాగలడా అనేది ఇక్కడ ప్రధాన ప్రశ్న.

# కరప్షన్ కింగ్.. నాగారం మున్సిపల్ కమిషనర్!?



**కాసులు కుమ్మరిస్తే యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు నిర్మించుకోవచ్చు..!? అదేంటని ప్రశ్నించిన అస్సలు పట్టించుకోరు..!? కళ్ళుండి చూడలేరు!? చెవులు ఉండి వినలేరు!? నోరు ఉండి మాట్లాడలేరు....!? మానం, మర్యాద, చదువు అన్ని గాలికి వదిలేసి కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు! రాజకీయ అండతోనే ఇదంతా జరుగుతోందని గుసగుసలు... అడిగే వాడెవడు!? పైన కింద తెల్ల వెంట్రుకలు వచ్చాయి ఎవడు ఏం చేసుకుంటాడో చేసుకొనియ్....!?**

✍ జయభేరి, నాగారం :

నాగారం మున్సిపాలిటీ యదేచ్ఛగా అక్రమాలకు నెలవులువుగా మారుతుంది. క్యూ లైన్ లో నిలబడేది సాదాసీదా జనం. పాపం వారికి ఏం తెలుసు!? కాసులు ఇస్తే కానిదేముందని!? తెలిసిన ఇవ్వడానికి కాసులు ఉండాలి కదా! అమ్మ అయ్య తాత సంపాదించిన ఆస్తులు మనకు లేకపాయే!?

**అక్రమంగా సంపాదించిన సొమ్ము లేకపాయే! అడ్డంగా అవినీతి కంపులో సెంటు కొట్టుకొని అధికారం చెలాయిస్తున్న మునిసిపాలిటీ పెద్దలకి కాదు కాదండోయ్... అదే గద్దలకి ఏం తెలుసు అని అనుకుంటున్నారా!? మున్సిపాలిటీలో కమిషనర్ జాబ్ అంటే రోజుకి లక్షలు ఇంటికి తీసుకుపోవాల్సిందే!? కమిషనర్ కి వత్తాసు పలుకుతూ నేను ఉన్న ఎవరు ఏం చేస్తారో!? ఎవరు ఏం రాసుకుంటారో!? రాసుకొని!? అన్నట్టుగా మునిసిపల్ చైర్మన్ ఆ ....రెడ్డి గారికి ఏది అడ్డం రాదు!? ఆయనకు అన్నీ ఎక్కువే!? అహంకారం ఆయన గుమ్మం ముందే వైపై ల తిరుగుతూ ఉంటుంది! పచ్చి నిజం ఇంటి వెనక పాతి పెట్టబడుతుంది! మొత్తానికి మీకు ఇప్పటికే అర్థమయిపోయి ఉండొచ్చు... నాగారం మునిసిపాలిటీలో మునిసిపల్ ఆఫీస్ కు ఎదురుగా ఉన్న ఐదు అంతస్తుల కమర్షియల్ భవనం. దీని వెనక అసలు కథ...ఇకయ్ వివరాల్లోకెళితే.... తీసుకున్నది రెండంతస్తుల వరకు పర్మిషన్! కానీ ఆయన గారు ఏకంగా అయిదు అంతస్తులు యదేచ్ఛగా కడుతూ, సెల్లార్ని కూడా నిర్మించుకొని టీఎస్ బి పాస్ చట్టాలు ఉన్న వాటిని తుంగలో తొక్కేసి, రాజకీయ మద అహంకారంతో, అండదండలతో, అధికార దాహంతో, మదమెక్కిన రాబందుల, రెక్కల చప్పుడు బుసలు కొడుతుంటే... నాగుపాముల పడగలు విప్పుతుంటే... మునిసిపల్ కమిషనర్ మాత్రం ఏం చేస్తాడు! జీ ...హుజూర్.... అని అనాల్సిందే!**

తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులు ప్రజలకు పని చేయాల్సింది పోయి ప్రజల ఉసురు పంచుకుని జలగల్లాగా తయారయ్యారనే కదా....గత ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీని బొందపెట్టి కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు తెలంగాణ ప్రజలు. కానీ ఇంకా మేడ్చల్ నియోజకవర్గంలో వార్డు మెంబర్ల నుంచి మునిసిపల్ చైర్మన్ దాకా వాళ్లకు అధికారం పోలేదట..! మరో మూడు నెలల్లోనే అధికారం వస్తుందని అహంకారం వారి కళ్ళల్లోనే కనిపిస్తుంది. అదేమంటే అదంతే మరి ఏం విప్పి చెప్పలేం!? కొన్ని కొన్ని అర్థం చేసుకోవాలి దూడ్!? రాజకీయ అండదండలతోనే మున్సిపల్ చైర్మన్ గా ఎదిగి, లక్షలకు లక్షలు వెనకేసుకుని, అడ్డంగాఅధికారం చెలాయిస్తూ, యదేచ్ఛగా అవినీతి అక్రమ నిర్మాణదారులకు అండగా నిలబడతారు. ఇదంతా నాగారం మునిసిపాలిటీలో ఆయా అధికారులపై ప్రజలు నా.. నా ఆరోపణలు చేస్తున్న అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు.




ఇదిగో ఇక్కడ మీరు చూస్తున్న ఐదు అంతస్తుల అక్రమ భవన నిర్మాణం. మునిసిపల్ ఆఫీసుకు ఎదురుగా ఉన్న కనీసం అన్ని దానికి వదిలిపెట్టి, నడి బజార్లో.... పిల్లి పాలు తాగుతూ నన్నెవరూ చూడట్లేదు... అని అనుకున్నట్టుగా కరెన్సీ కట్టలకు అమ్ముడుపోయారో ఏమో తెలియదు!? కానీ మొత్తానికి కమర్షియల్ ఐదు అంతస్తుల భవన నిర్మాణం యదేచ్ఛగా అక్రమంగా నిర్మించుకుంటున్నారు. ఇదేంటని కమిషనర్ను అడిగిన మౌనం గా ఉంటారు. లేదంటే మునిసిపల్ కమిషనర్ కు వత్తాసు పలికే మునిసిపల్ చైర్మన్ కూడా ఇంకా తామేదో అధికారంలో ఉన్నం అని అనుకుంటున్నారో ఏమో తెలియదు కానీ, ఆచ్చం కేసీఆర్ భాషని వాడుతూ అదే అహంకార స్వభావాన్ని బయటపెడుతుంటారు. ఇంతకీ అక్రమ భవన నిర్మాణదారుడికి అండగా నిలబడింది ఎవరు? మరి ఈ రాజకీయ నాయకుడైన అన్న ఆరోపణలు కు సమాధానం ఎవరు చెప్పాలి? అని నాగారం మున్సిపాలిటీలోని ప్రజలు ముక్కుసూటిగానే ప్రశ్నిస్తున్నారు. చిన్న రేకుల షెడ్డు వేసుకుంటే దాన్ని కూలగొట్టే వరకు మున్సిపల్ అధికారులు తామేదో పెద్ద ఘనకార్యం చేసినట్టు,పైగా నీతిమంతులం అన్నట్టు... వెంటనే యాక్షన్ తీసుకొని ఆ రేకుల షెడ్డును కూల్చేస్తుంటారు!



**మరి కంటికి ఎదురుగా ఐదంతస్తుల భవనం కనబడుతుంటే... వాళ్లేమైన పిల్లి వెంట్రుకలు కట్ చేయనీకి పోయారా!? అని అంటున్నారు స్థానికులు... కాంగ్రెస్ గవర్నమెంట్ ఏర్పాటు కావస్తున్న ఇలాంటి అహంకార పూరిత స్వభావం ఉన్న టిఆర్ఎస్నేతలు .... మాజీ నాయకులు కాదట... మరో మూడు నెలల్లోనే తిరిగి అధికారం చేజిక్కించుకొని, తిరిగి అధికారాన్ని చెలాయిస్తూ, మరింత దోచుకుంటారట!? అనే విధంగా ఇప్పటికి చింత చచ్చిన పులుపు చావని ఆ... రాజకీయ నేతలను చూస్తే నోటికొచ్చిన బండ బూతులు తిడుతున్నారు అతని బాధితులు... మొత్తానికి రాజకీయ అధికారం ఉంటే మునిసిపల్ అధికారులను గుప్పిట్లో పెట్టుకోవచ్చు!? అనేది ఇక్కడ నిజమనిపిస్తుంది. ఎవరన్నా ప్రశ్నిస్తే నీది ఏ ఊరు? ఎక్కడ ఉంటావు అనే ప్రశ్నలు సిబిఐ కంటే దారుణంగా వేస్తాడు ఆ... రెడ్డి గారు...!? ఇంతకీ ఆయన కింద ఉన్న భూ ఆక్రమణలు, ఆయన అధిమి పట్టిన బాధితులు, ఒక్కొక్కటిగా బయటికి తెచ్చే ప్రయత్నం చేస్తుంది జయభేరి న్యూస్ నిఘా టీం... మరొక ఎపిసోడ్లో ఆ చైర్మన్ కి అన్ని ఆస్తులు ఎక్కడివి !?అని కోణంలో దర్యాప్తు కొనసాగుతూనే ఉంది..! ఇంతకీ నాగారం మున్సిపాలిటీ ఆఫీసుకు ఎదురుగా ఉన్న ఆక్రమ భవనాన్ని కుల్చేస్తర!?లేదంటే పెంచి పోషిస్తార!? అన్నది నాగారం మున్సిపల్ కమిషనరే సమాధానం చెప్పాలి? ఇప్పటికే ఎన్నో ప్రసార మాధ్యమాల్లో ఈ వార్తలు వస్తున్న... బెల్లం కొట్టిన రాయిలా మారిపోతూ యదేచ్ఛగా కాలాన్ని నెట్టుకొస్తున్నారు. కాసులు వెనకేసుకుంటున్నారు! మేడ్చల్ జిల్లా కలెక్టర్ గారు ఇప్పటికైనా పూర్తి విచారణ జరిపి ఇలాంటి,మున్సిపల్ అధికారులకు అండదండగా చూపిస్తున్న ఆ ...రాజకీయ నాయకులకు చెక్ పెట్టకపోతే మరిన్ని స్థానిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానిక కాంగ్రెస్ వాదులు మండిపడుతున్నారు.**

## వంద రోజుల పాలనలో విఫలం
# యూ టర్న్ రేవంత్

✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 15

వంద రోజుల పాలనలో ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యిందని హరీష్ రావు ఆరోపించారు. మూడు విచారణలు, ఆరు వేధింపులు అన్నట్లు కాంగ్రెస్ పాలన సాగిందని..మొదటి సంతకం రుణమాఫీ అని మాట తప్పారని విమర్శించారు. తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. కుర్చీ ఎక్కడం మాత్రం రెండు రోజుల ముందు జరుపుకున్నారు కానీ గ్యారంటీలకు మొదటి క్యాబినెట్ లోనే చట్టబద్ధత తెస్తామని మాట తప్పారన్నారు. ప్రగతి భవన్ ను కూల్చుతాం నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.ఈ రోజు ఉప ముఖ్యమంత్రి గారు అందులో ఉంటున్నారని గుర్తుచేశారు. అసెంబ్లీ స్వరూపాన్ని మార్చేస్తా అన్నారు. ఇప్పటివరకు తట్టడం మట్టి కూడా తవ్వలేదన్నారు. రైతు భరోసా అన్నారు. మేమిచ్చే రైతు బందును ఇప్పటివరకు పూర్తి చేయలేదు. రుణమాఫీ పై అతిగతి లేదు ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఆసరా పింఛన్లు పెంచుతామన్నారు ఉన్న పింఛన్లు సరిగా ఇవ్వడం లేదని ఆరోపించారు. తెలంగాణ పరువు పెంచే ప్రయత్నం కేసీఆర్ చేస్తే, రేవంత్ రెడ్డి గారు కరువు పెంచేందుకు పోటీపడుతున్నారని విమర్శించారు. దేశమంతా కరువు ఉందని మాటలు చెబుతూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని.. కెసిఆర్ పాలనలో పచ్చడి పొలాలు కనిపిస్తే 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పాలనలో పంటలకు మంటలు పెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. కెసిఆర్ వ్యవసాయాన్ని శిఖరాగ్రంలో నిలబెడితే రేవంత్ రెడ్డి గారు శిథిలావస్థకు చేర్చుకున్నారు. కెసిఆర్ హయాంలో తాగునీటికి సాగునీటికి లోటు లేని పరిస్థితి ఉంటే, రేవంత్ రెడ్డి పాలనలో కన్నీళ్ళకు కొరత లేని పరిస్థితి వచ్చిందని ఆవేన వ్యక్తం చేశారు. ఖమ్మం పట్టణంలో ప్రతి మూడు రోజులకు ఒకసారి నల్ల వస్తున్నదని చెబుతున్నారని కర్ణాటక నుండి తాగునీరు తేవడంలో పూర్తిగా వైఫల్యం పొందారని హరీష్ విమర్శించారు. వంద రోజుల్లో గొల్ల కురుమలకు గొర్రెలు ఇస్తామని మాట చెప్పారు. ఒక్కరికి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కెసిఆర్ అనారోగ్యంపై దిగజారుడు వ్యాఖ్యలు చేశారని..పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపి కుమ్మక్కు అయిందని మొన్నటి బడేబాయ్ వ్యాఖ్యలతో అర్థమైందన్నారు. బడే బాయ్ చోటే బాయ్ బంధం బయట పడిందని..దేశంలో బద్ధ విరోధులమని చెబుతారు తెలంగాణలో మాత్రం బలమైన బంధంగా ఉంటారని సెటైర్ వేశారు. పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని అన్నారు రేవంత్ రెడ్డి. ఈరోజు బిజెపి నాయకుల ఇంట్లోకి వెళ్తున్నాడు.ఫార్మాసిటీ రద్దు అన్నారు. మాట మార్చారు. మెట్రో రైలు వద్దు అన్నారు. మాట మార్చారు. అనేక విషయాల్లో యూ టర్న్ తీసుకున్నారు. యూటర్న్ యూట్యూబ్ పాలని కనిపిస్తున్నదని హరీష్ ఆరోపించారు. గేట్లెత్తితే మీ పార్టీలో ఒక్కరు మిగలదని



రేవంత్ రెడ్డి అంటాడు పార్టీల గేట్లు కాదు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి పంటలకు నీళ్లు ఇవ్వండి.పొలాలకు నీళ్లు ఇచ్చి పంటలు కాపాడే ప్రయత్నం చేయండని సలహా ఇచ్చారు. వందరోజుల కాంగ్రెస్ పాలనలో 174 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 38 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చెందారన్నారు. కౌలు రైతులకు ఎకరానికి 15000 అన్నారు వ్యవసాయకులకు 12,000 అన్నారు వరి పంటకు 500 బోనస్ అన్నారు. ఇవన్నీ మోసం దగా అన్యాయమని విమర్శించార. రేపు నోటిఫికేషన్ అంటున్నారు నీకు చిత్తశుద్ధి ఉంటే ఈ రోజే వాటిని అమలు చేయాలని సవాల్ చేశారు. ముళ్ళ కంచెలు, నిర్బంధాలు, అరెస్టులు పెరిగినాయి. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారు. ప్రభుత్వం అయిపోలేలపై వార్తలు రాస్తే జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. వర్షపాతం సరిగా లేనందున పంటలు ఎండిపోతున్నాయని ద వైర్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం అన్నాడు. 14 శాతం వర్షపాతం ఎక్కువ ఉంటుందని వాతావరణ శాఖ ఏమో స్పష్టం చేసిందన్నారు. ప్రతి మహిళకు 2500 రూపాయలు ఇస్తా అన్నారు. మూడు నెలల్లో ఇప్పటివరకు మొత్తం 7500 కోట్లు మహిళలకు బాకీ పడింది. ఏం మొహం పెట్టుకొని మహిళా సదస్సు నిర్వహిస్తారని ప్రశ్నించారు. కళ్యాణ లక్ష్మీతో తులం బంగారం ఇస్తా అన్నారు. లక్ష పైగా పెళ్లిళ్లు జరిగాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి జరిగిన పెళ్లిళ్లకు మా ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వాల్సిందేనన్నారు. అనవసరానికి పోతే ఉన్నవస్త్రం పోయిందన్నట్టుందని హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాల మీద దాడులు చేస్తున్నది. మా నాయకుల మీద కార్యకర్తల మీద అక్రమంగా కేసులు బనాయిస్తున్నది. కాంగ్రెస్ హస్తం.. బస్మాసురా హస్తంగా మారిందన్నారు. మెడ మీద కత్తి పెట్టి నాయకులను పార్టీలో చేర్చుకుంటున్నాం అని అనుకుంటున్నారు కావచ్చు.ప్రజలు అన్నీ గమనిస్తున్నారని మండిపడ్డారు.

# పీర్జాదిగూడ కార్పొరేషన్ అభివృద్ధికి 1కోటి రూపాయల స్పెషల్ ఫండ్

- డివిజన్లలో కమ్యూనిటీ భవనాల నిర్మాణం,పలు మౌలిక సౌకర్యాల అభివృద్ధి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన తుంగతుర్తి రవి

**జయభేరి, మేడిపల్లి :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధి లో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ 1కోటి రూపాయలు విడుదల చేసింది. పీర్జాదిగూడ లోని 22వ డివిజన్ బుద్ధానగర్ లోని సీనియర్ సిటిజన్స్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 8లక్షలు. 17వ డివిజన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 5 లక్షలు, మేడిపల్లిలోని 15వ డివిజన్ క్రాంతి కాలనీ లో కమ్యూనిటీ హాల్ 8 లక్షలు. 10వ డివిజన్ లోని డ్వాక్రా బిల్డింగ్ నిర్మాణానికి 2 లక్షలు. 13వ డివిజన్ లో కమలానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 4లక్షలు. 3వ డివిజన్ లో సీసీ రోడ్ల నిర్మాణం 3 లక్షలు. 23వ డివిజన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 3లక్షలు. 8వ డివిజన్ లో బిబి సాహెబ్ మక్త రోడ్ no 5 నిర్మాణానికి 3 లక్షలు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సరఫరా కొరకు HMWS కి (2,3,15 డివిజన్లకు) 36 లక్షల రూపాయల నిధులను కేటాయించడం జరిగింది. నీటి సమస్యల గురించి HMWS ఆఫీసర్ నిర్మల, మేనేజర్ తిరుపతి లతో చర్చించటం జరిగింది. ఈ అభివృద్ధిలో భాగంగా కమిటీ హాల్స్ నిర్మించే స్థలాలను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో మున్సిపల్ ఏఈ బిక్షపతి, మున్సిపల్ అధికారులతో పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. పీర్జాదిగూడ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించడం చాలా సంతోషకరమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ కి, సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డికి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డికి, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులకు పీర్జాదిగూడ కార్పొరేషన్ ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి, నాగేష్, రంజిత్ రెడ్డి, పవన్ గౌడ్, మోహన్, జనగాచారీ, అయిలేష్ యాదవ్, సుధర్శన్ రెడ్డి, బర్రె నాగరాజు, మనిరాం నాయక్,ఎన్ ఎన్ కే దుర్గ, ఉదయ్ రాజ్ గౌడ్, ఉప్పరి ఉదయ్ కుమార్, సుధీర్, విక్రమ్, శ్రీకాంత్ పటేల్, కపిల్, మహిళా అధ్యక్షురాలు శ్రీలత బద్రునాయక్, నంధిత గౌడ్, శారదా గౌడ్, దివ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.







# కంఠం కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

- తోటకూర వజ్రేష్ యాదవ్

**జయభేరి, మార్చి 15 :**

శామీర్ పేట్ మండలం రైతుబంధు సమన్వయ కమిటీ అధ్యక్షుడు కంఠం కృష్ణారెడ్డి జన్మదిన వేడుకను మేడ్చల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ లు కేక్ కట్ చేసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి జన్మదిన వేడుకలు ఇంకా జరుపుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, విష్ణు గౌడ్, ఎంపిటిసి అశోక్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి



**జయభేరి, మార్చి 15 :**

మూడు చింతలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో శుక్రవారం కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తోటకూర వజ్రేష్ యాదవ్ కూడా హాజరయ్యారు ప్రోటోకాల్ లేకుండా స్టేజ్ పై ఏలా కూర్చుంటారు అని తోటకూర వజ్రేష్ యాదవ్ ను బిఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. దీనితో బిఆర్ఎస్ , కాంగ్రెస్ నేతల మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. ఇరు వర్గాలను మండల వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి శాంతింప చేశారు. అనంతరం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ , జడ్పిటిసి హరి వర్ధన్ రెడ్డి, మూడు చింతలపల్లి మండలం తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డి, మూడు చింతలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జామ్ రవి ఎంపీపీ హారిక గౌడ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటిసి నాగరాజు, ఏవో కృష్ణవేణి, డిప్యూటీ తహశీల్దార్ నాగజ్యోతి, ఆర్ ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# మల్కాజిగిరి లో గులాబీ జెండా విజయకేతనం

- ఉప్పల్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్:**



హైదరాబాద్ హబ్సిగూడ లో మల్కాజిగిరి బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థిగా ఎన్నికైన రాగిడి లక్ష్మారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఉప్పల్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేసిన రాగిడి లక్ష్మారెడ్డికి ఎంపి గా అవకాశం ఇవ్వడం శుభ పరిణామమని, భారీ మెజారిటీతో రాగిడి లక్ష్మారెడ్డి ఎంపిగా విజయం సాధిస్తారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గం అయిన మల్కాజిగిరి నుండి బిఆర్ఎస్ పార్టీ ఎంపి గా అవకాశం ఇవ్వడం పట్ల కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు లకు రాగిడి లక్ష్మారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో ఎమ్మెల్యేలు అందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో ఉంటూ మల్కాజిగిరి పార్లమెంట్ లో విజయకేతనం ఎగుర చేస్తానని రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పోరేటర్లు, మాజీ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు మహిళా నాయకురాలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



# 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

- విద్యార్థులకు పరీక్ష కిట్స్ ను అందచేసిన మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి

**జయభేరి, మార్చి 15 :**



మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపల్ పరిధి దేవర యాంజాల్ లోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ పచ్చిమడ్ల నర్సింగరావు గౌడ్, రామాలయం మాజీ ధర్మకర్త పట్నం నర్సింహారెడ్డి, శ్రావంత్ రెడ్డి లు హాజరయ్యారు. అనంతరం శ్రావంత్ రెడ్డి తండ్రి గారైన దేవేందర్ రెడ్డి జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రీ సెట్లను అందచేశారు. అదేవిధంగా విద్యార్థులు సర్టిఫికెట్ లను భద్రపరుచుకోవడానికి పిఈటీ రాధిక ఫైల్స్ ను అందచేశారు. ఈ సందర్భంగా శ్రావంత్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం శాలువలతో ఘనంగా సన్మానించారు. పరీక్షలు అంటే విద్యార్థులు ఒత్తిడి కి గురవకుండా ఉండాలని వారు సూచించారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలేష్, ఉపాధ్యాయులు హరికృష్ణ రెడ్డి, సుధాకర్, తిరుమల ప్రసాద్, రాణి, సుధాకర్ రెడ్డి, రమాదేవి, రేష్మ భేగం, ప్రశాంత్ నాయక్, రాం మోహన్, మంజులత, రాధిక, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధి సంక్షేమానికి అధిక నిధులు

**జయభేరి, ఉప్పల్ :**

సీవరేజ్ పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. చర్లపల్లి డివిజన్, VN రెడ్డి నగర్ లో రూ .36లక్షల వ్యయం తో సీవరేజ్ పైపులైన్ నిర్మాణ పనులను గౌరవ ఎమ్మెల్యే గారు ప్రారంబించారు. ఎమ్మెల్యే మాట్లడుతూ.. నియోజకవర్గం లో అభివృద్ధి సంక్షేమానికి అధిక నిధులు ఖర్చుచేస్తున్నామని, నియొజకవర్గం లో అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. ప్రజాసంక్షేమం కొసం నిధులు తీసుకొచ్చి ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తున్నామన్నారు, అభివృద్ధికి స్థానిక ఆధికారులు ,ప్రజాప్రతినిధులు సమన్వయముతో పనిచేయాలని సుచించారు. ఈ కార్యక్రమం తో DGM సతీష్, AE రోహిత్ జిహెచ్ఎంసీ ఆధికారులు కాలనీ వాసులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గోన్నారు.



# ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మున్సిపల్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన మాజీ మంత్రివర్యులు మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి. శుక్రవారం పోచారం మున్సిపల్ కార్యాలయంలో పోచారం మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్ గూడా, యమ్నం పేట్, అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప, నారపల్లి, పోచారం లలోని 17 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి వైస్ చైర్మన్ రెడ్డియానాయక్ కమిషనర్ వేమన రెడ్డి, కౌన్సిలర్లు గొంగళ్ళ మహేష్, సింగి రెడ్డి సాయి రెడ్డి, కొ ఆప్షన్ సభ్యులు అక్రమ్ ఆలి దాసరి శంకర్, పోచారం మున్సిపల్ భారత్ రాష్ట్ర సమితి పార్టి ప్రధాన కార్యదర్శి నల్ల వెల్లి శేఖర్ ముదిరాజ్, నాయకులు నరి కాశయ్య బద్దం జగన్మోహన్ రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, మోటుపల్లి శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పోచరం మున్సిపాలిటీ పరిధి లోని 3వ వార్డు యంనంపేట్ EWS కాలనీ లో కమ్యూనిటీ భవనం ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. పోచరం మున్సిపాలిటీ పరిధి లోని 3వ వార్డు యంనంపేట్ EWS కాలనీ లో సాదారణ నిధులు అంచనా వ్యయం 35.00 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనం ను స్థానిక కౌన్సిలర్ చింతల రాజశేఖర్ గారితో కలసి ప్రారంభించరు. ఈ కార్యక్రమము లో వైస్ చైర్మన్ రేద్య నాయక్, కమిషనర్ పశ్య వేమన రెడ్డి, కౌన్సిలర్ గొంగల్ల మహేశ్, AE నరేష్ నాయకులు పోచారం మున్సిపల్ భారత్ రాష్ట్ర సమితి పార్టి ప్రధాన కార్యదర్శి నల్ల వెల్లి శేకర్ ముదిరాజ్ నార్రి కషయ్యా, బద్దం జగన్ మోహన్ రెడ్డి,అకిటి బల్ రెడ్డి, సుర్వు శ్రీనివాస్, బైరా ఐలయ్య , సాగ్గు రవి,నరేందర్, శ్రీ రామ్,జని, బాబు, యోగానంద, శంకర్,మున్సుపల్ సిబ్బంది కలని వాసులు తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, ఘట్కేసర్**

# హెచ్ ఎం డి ఏ నీళ్ల ట్యాంకర్ ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- ఆరుగురి కి గాయాలు



**జయభేరి, శామీర్ పేట్, మార్చి 15 :**

రాజీవ్ రహదారి పై మొక్కలకు నీళ్లు పోస్తున్న హెచ్ ఎం డి ఏ నీళ్ల టాంకర్ ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన సంఘటన తుర్కపల్లి లోని జినోము వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దుబ్బాక డిపో కు చెందిన ts 36 టి 7407 గల ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ కు వెళ్తోంది. ఈ క్రమంలో లాల్ గడి మాలక్ పేట్ పరిధిలోని ట్రక్ లే బై వద్దకు రాగానే బస్సు అదుపు తప్పి మొక్కలకు నీరు పోస్తున్న నీళ్ల టాంకర్ ను వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ నీళ్ల టాంకర్ డ్రైవర్ తో పాటు మరో నలుగురు ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. ఎవరికి ప్రాణనష్టం జరగ లేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## సంత్ సేవాలాల్ లంబాడీల కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 15 :

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి లంబాడీలకు సంత్ సేవాలాల్ మహారాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయునట్లు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడానికి హర్షిస్తూ శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎల్లారెడ్డి మండల కేంద్రంలో వివిధ తండాల గిరిజన నాయకులు కలిసి సీఎం రేవంత్ రెడ్డి,ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాదిక అన్ని రంగాల్లో వెనుకబడిన లంబాడీలను గత ప్రభుత్వం అన్ని రంగాల్లో విస్మరించి కాలగర్భంలో కలిసిపోయాయని వారు అన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 90 రోజులనే సంత్ సేవాలాల్ లంబాడీల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలతోకాంగ్రెస్ప్రభుత్వం లంబాడీలకు అన్నివిధాలుగా అండగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కురుమ సాయిబాబా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అతి కొద్ది రోజుల్లోనే సీఎం రేవంత్ రెడ్డి అన్నికులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. అన్నికులాలకు ఆర్థికంగా బలోపేతం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలోమండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్, గణేష్, నాగేష్,కైలాస్, మైపాల్, సుధాకర్, వసంత్, ప్రకాష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఉద్యోగుల డైరీ ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 15 :

దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర సంఘ డైరీని శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ,జిల్లా ఎస్పీ సింధు శర్మ,డిఇవో రాజు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దివ్యాంగుల ఉద్యోగ సంఘ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్ మాట్లాడుతూ దివ్యాంగుల ఉద్యోగుల రాష్ట్ర సంఘ నాయకుల పిలుపుమేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో దివ్యాంగుల ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో క్యాలెండర్ ను ఆవిష్కరించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు చాలా కాలం నుండి పెండింగ్లో ఉన్నాయని ఏ ప్రభుత్వం కూడా పరిష్కరించలేదని,నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాణాల నరేష్ రెడ్డి,కోశాధికారి చిందం సాయిలు,ఉపాధ్యక్షులు బి.భూమయ్య,ఎండి అజ్జు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు లక్కీ డ్రా



జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 15 :

కామారెడ్డి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమక్షంలో హైదరాబాద్ బేగంపేట పబ్లిక్ స్కూల్ 1వ తరగతి ప్రవేశాలకు సంబంధిచిన లక్కీ డ్రా నిర్వహించారు. ఇద్దరు బాలికలను లను లక్కీ డ్రా ఎంపిక చేశారు.సుంకరి బృందన, త్రిక్షణ ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిని జి.రజిత,జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ ,అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ బీఎల్ఫ్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గా వడ్ల సాయికృష్ణ



జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 15 :

హైదరాబాద్ లోని ఓంకార్ భవన్ లో శుక్రవారం బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సభ లో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే, 5,మంది అభ్యర్థులను ప్రకటించారు. ఈ సమావేశానికి అధ్యక్షులుగా, యస్,సిద్ధిరాములు,బిఎల్ ఎఫ్,రాష్ట్ర నాయకులు,యం,మట్టయ్య,లు బిఎల్ ఎఫ్, నాయకులు వ్యవహరించారు.ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా హాజరైన బిఎల్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాష్,ఎం.సి.పి.ఐ ( యు ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్దికాయాల అశోక్ ఓంకార్ హాజరు అయ్యారు. బిఎల్ ఎఫ్,రాష్ట్ర కన్వీనర్,దండి వెంకట్ ,పార్వతాలు, గాదగోని, రవి, తదితరుల ఆధ్వర్యంలో పార్లమెంట్ అభ్యర్థులను ఖరారు చేసి అధికారికంగా ప్రకటించారు, జహీరాబాద్ పార్లమెంట్ బిఎల్ఎఫ్ అభ్యర్థిగా"వడ్ల సాయికృష్ణ "ను అభ్యర్థిగా ప్రకటించటం జరిగింది.ఈ సందర్భంగా బిఎల్ఎఫ్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి వడ్ల సాయికృష్ణ మాట్లాడుతు..విద్యార్థి నాయకుడైన నన్ను బీడీఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గా ఉన్న నన్ను బి ఎల్ పి,బిఎల్ఎఫ్, తెలంగాణ కమిటి లు,ఒక సామాన్య బీసీ సామాజిక వర్గానికి చెందిన నాపై నమ్మకం ఉంచి,జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ కి బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ,బిఎల్ఎఫ్ భాగస్వామ్య పక్షాల పార్టీలు మద్దతు తో బహుజన రాజ్యాధికారం కోసం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజల పక్షాన ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం లో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ లో గెలుపే లక్ష్యంగా చేసుకుని ముందుకు వెళ్తననీ ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఎఫ్ కన్వీనర్లు దండి వెంకట్ ,ఎస్.సిద్ధిరాములు, పర్వతాలు, గదగొని రవి, వనం సుధాకర్, నూనె వెంకట స్వామి, పార్వతాలు, బిఎల్ఎఫ్ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సాయిబాబా, చంద్రకాంత్ రెడ్డి, గంగాధర్, నగేష్, స్వప్న, శాంతమ్మ పాల్గొన్నారు.

# చెత్త కుప్పల్లో సర్కార్ మందులు...

- జిల్లా కేంద్రంలోని రైల్వే ట్రాక్ పక్కన కాలనీలో దర్శనం
- గడువు ముగిసిన,ముగియని మందులు లభ్యం
- మందులన్నీ క్యాల్షియం విటమిన్ డి3 కి సంబందించినవే
- కొందరు మందు బిల్లలను చెట్లకు వేస్తున్నట్టుగా అనుమానం
- ప్రజలకు ఇవ్వరు కానీ కుప్పల్లో వేస్తారా అంటున్న ప్రజలు
- చిన్న పిల్లలు తీస్తే ఎలా అని ప్రశ్నిస్తున్న ప్రజలు

జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో :

సర్కార్ సొమ్ము దక్కాలంటే అదృష్టం ఉండాలని నాటి పెద్దల సామెత. సర్కార్ దవాఖానలో మందులు దొరకాలంటే కూడా అదృష్టం ఉండాలని నేటి సామెత. ఈ సామెత కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సరిగ్గా వర్తిస్తుంది. ప్రతిరోజు వందలాదిగా కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి ప్రజలు వివిధ రకాల జబ్బులు, ఇతర కారణాలతో వెళ్తుంటారు. అయితే ప్రజలకు వైద్యులు పరీక్షలు చేసి వివిధ రకాల మందులను రాసిస్తుంటారు. అందులో కొన్ని మందులు మాత్రమే ఆస్పత్రిలో లభిస్తాయి. మరికొన్ని మందులు బయట మెడికల్ షాపులలో కొనుక్కోవాలని సూచిస్తుంటారు. ఇది ప్రతిరోజు జరిగేదే. అయితే జిల్లా కేంద్రంలోని రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న శ్రీరాంనాగర్ కాలనీ రుక్మిణి కుంట మైసమ్మ ఆలయం ముందర గల చెత్త కుప్పల్లో సర్కార్ మందులు కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయి. కొన్ని మందులు గడువు ముగిసినవి కాగా మరికొన్ని ఇంకొక సంవత్సరం వరకు గడువు ఉన్న మందులు కావడం అక్కడి కాలనీ వాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. కొందరు కాలనీ వాసులు విలేకరులకు సమాచారం ఇవ్వగా వెళ్లి చూడటంతో నిజంగానే అక్కడ మందులు కుప్పలు తెప్పలుగా పడేసి ఉన్నాయి. గడువు ముగిసిన మందులను ఆస్పత్రుల్లోనే వైద్యులు, వైద్య సిబ్బంది ప్రత్యేకంగా ప్యాక్ చేసి వాటిని డిస్ట్రిబ్యూటర్లకు అందజేస్తారు. కొన్నిసార్లు బయట పడేయడానికి మున్సిపల్ సిబ్బందికి ఇస్తే వాటిని సిటీకి దూరంగా ఉన్న డంపింగ్ యార్డులో పడేసి కాల్చేస్తారు. కానీ బయట ఎక్కడ పడేయడానికి వీల్లేదు.పైగా జనావాసాల మధ్య పడేయడానికి అస్సలు వీల్లేదు. కానీ ఇక్కడ అవేమి ఆలోచించలేదు. శరీరానికి బలాన్నిచ్చే క్యాల్షియం విటమిన్ డి3 మందులు యథేచ్ఛగా పడేసారు. ఇక్కడ విచిత్రం ఏమిటంటే 2025 వరకు గడువు ఉన్న క్యాల్షియం టాబ్లెట్స్ కూడా చెత్త కుప్పల్లో పడేసి ఉన్నాయి. గడువు ఉన్న మందులను కాలనీ వాసులు షీట్స్ నుంచి మందులను వేరు చేసి వాటిని తీసుకెళ్లి ఇంట్లో ఉన్న చెట్లకు వేస్తున్నారట. ఈ మందులను ఎవరు వేస్తున్నారని కాలనీ వాసులను అడిగితే రాత్రిపూట వచ్చి పడేస్తున్నారేమో అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కుప్పలుకుప్పలుగా ఇలాగే పడేస్తే తామే మందులను కాల్చేసామన్నారు. అయినా మందులను ఇష్టానుసారం పడేస్తున్నారని తెలిపారు. కాలనీల్లో చిన్న పిల్లలు తిరుగుతారని పిల్లలకు తెలియకుండా మందులు నోట్లో వేసుకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. మరోసారి ఇలా మందులు వేయకుండా చూడాలని కోరుతున్నారు.








# ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం



జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో :

సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడం,కృత్రిమ మేధస్సు వల్ల స్వతహాగా ఆలోచించే విధానం సన్నగిల్లడంతో పాటు మోసాలు ఎక్కువగా జరిగే అవకాశముందని,అవసరం మేర సాంకేతికతను వినియోగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు.ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరములో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆన్ లైన్ లో గ్యాంబ్లింగ్ వంటి వివిధ యాప్ ల ద్వారా కుటుంబాలు నాశనమవుతూ,ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని,యువత అప్రమత్తంగా యాప్ లను ఉపయోగించాలని హితవు చెప్పారు. దైనందిన జీవితంలో ఆన్ లైన్,ఆఫ్ లైన్, మాలి లెవెల్ మార్కెటింగ్,ఈకామర్స్,తదితర విధానాల ద్వారా వస్తువులు కొనుగోలు చేసి మోసపోతున్న వినియోగదారుల రక్షణకు ప్రభుత్వం 2019 లో వినియోగదారుల రక్షణ చట్టం తెచ్చిందన్నారు. ప్రధానంగా తూనికలు, కొలతలలో మోసాలు, కల్తీ, నాణ్యత లేని వస్తువులు, విక్రయించడం బ్లాక్ మార్కెటింగ్ చేసి అధిక ధరలకు విక్రయిచడం వల్ల మోసపోతున్నారన్నారు.ఈ చట్టం ద్వారా నష్టపోతే పరిహారం పొందే హక్కుతో పాటు వస్తువు ఎంపిక చేసుకునే హక్కు,భద్రత,సమాచారం,విద్య,ఆరోగ్య హక్కులు పొందవచ్చన్నారు.వినియోగదారుడు వస్తువు కొనేముందు నాణ్యత,ఎక్స్పైరీ తేదీ, గరిష్ట ధర, వంటివి పరిశీలించి రసీదు తీసుకోవాలని సూచించారు.డీఎస్ ఓ మల్లికార్జున్ బాబు,జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి,ఫుడ్ ఇన్స్పెక్టర్ సునీత,ఉద్యానవన అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ నేడు తినే ఆహారం తో పాటు ప్రతి వస్తువు కల్తీ అగుచున్నదని,కొన్ని చిట్కాలు పాటిస్తే నకిలీవో కావో తెలుసుకొని అప్రమత్తం కావచ్చని అన్నారు. నేడు గూగుల్,మోనోపాలీగా ఆన్ లైన్ రంగాన్ని శాసిస్తున్నాడని,మన ప్రభుత్వం రూపొందించిన ఓ.ఎన్.డి.సి ప్లాట్ ఫారం,యర్ది యాప్ ఉపయోగించాలని సూచించారు.అదేవిధంగా అందరు మన దేశ ఉత్పత్తులను ఉపయోగిస్తే డాలరుతో సమానంగా మన రూపాయి వృద్ధిచెంది దేశం ఎంతో పురోగమిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బావయ్య, పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకులు రఘునందన్, సహాయ పౌర సరఫరాల అధికారి నిత్యానందం, వినియోగదారుల ఫోరమ్ సభ్యులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల సమస్యలు తీర్చాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే రైతులకు న్యాయం చేయాలి

జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో :

కామారెడ్డి జిల్లాలోని బిబిపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ గత ఎనిమిది సంవత్సరాలుగా చెప్పులు అరిగేలా తిరిగారు. మండల కేంద్రానికి చెందిన ఎల్లమైన శ్రీకాంత్ తండ్రి తిరుమల్లయ్య భూమీ ఇప్పటి వరకు పాస్ బుక్ లో 21గుంటల 1/2 భూమి ఎక్కలేదు. ప్రస్తుత కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి ప్రతి గ్రామంలో ఫిర్యాదుల పెట్టె ద్వారా సమస్యలు తెలుసుకుంటున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తన 21 1/2 గుంటల భూమిని వారి పేరున చేయించాలని ఫిర్యాదుల పెట్టె ద్వారా ఎమ్మెల్యే కు తెలిసేలా వినతి చేశారు.

# ఎమ్మెల్సీ కవిత అరెస్ట్





- మాజీ సీఎం కేసిఆర్ కూతురు కవిత అరెస్ట్
- ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టు చేస్తున్నట్లు వెల్లడి
- సుమారుగా నాలుగు గంటల పాటుగా కవిత ఇంట్లో ఈడి సోదాలు

జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో :

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరో షాక్ తగిలింది. శుక్రవారం ఈడి ఆమెను అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపింది. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఆమె నివాసంలో శుక్రవారం ఈడీ అధికారులతో కలిసి ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు షాక్ తగిలింది. బంజారాహిల్స్ లోని ఆమె నివాసంలో ఈడీ అధికారులతో కలిసి ఐటీ అధికారులు సోదాలు జరుపుతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి ఈ సోదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి వచ్చిన 12 మంది అధికారుల బృందం 4 టీంలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తోంది. ఇద్దరు మహిళా అధికారులతో సహా 10 మంది అధికారులు సోదాల్లో పాల్గొన్నారు. కవితతో పాటు ఆమె భర్త వ్యాపారాలపైన ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇంట్లోకి ఎవరినీ అనుమతించడం లేదు. ఈ క్రమంలో కవిత రెండు ఫోన్లను అధికారులు సీజ్ చేశారు.ఆమె స్టేట్ మెంట్ ను రికార్డు చేసినట్లు సమాచారం. మరోవైపు, కవిత నివాసం దగ్గర భారీగా పోలీసులు మోహరించారు.మరోవైపు,లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేసిన పిటిషన్ పై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 19కి వాయిదా వేసింది. లిక్కర్ కేసులో విచారణకు హాజరు కావాల్సిందిగా ఈడీ నోటీసులను సవాల్ చేస్తూ ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టొద్దని ఆమె పిటిషన్ దాఖలు చేశారు. దీంతో దర్యాప్తు సంస్థల ముందు ఆమె విచారణకు హాజరవ్వాలా.. వద్దా.. అనే దానిపై ఆ రోజు విచారణ కీలకంగా మారనుంది.


## పెరిక కార్పొరేషన్ కు 10 వేల కోట్ల నిధులు కేటాయించాలి


- పెరిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిన్నం రామచంద్రం.



జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో :

రాష్ట్ర ప్రభుత్వం పెరిక కార్పొరేషన్ కు పదివేల కోట్ల నిధులను కేటాయించాలని పెరిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిన్నం రామచంద్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెరిక కులస్తులను గుర్తించి వారికి కార్పొరేషన్ ను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.నిరుపేదలైన పెరిక కులస్తుల ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రాధాన్యతనిస్తూ ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.పెరిక కులస్తుల కులవృత్తి లేక వివిధ పనులు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారని.ఈ విషయమై ప్రభుత్వం పెద్ద మనసుతో నిధులు కేటాయించి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## ‘అందాజ్ అప్నా అప్నా’ సీక్వెల్ కోసం రంగం సిద్ధమవుతుందన్నన్న అమీర్‌ఖాన్

అమీర్‌ఖాన్, సల్మాన్‌ఖాన్ నటించిన ‘అందాజ్ అప్నా అప్నా’ (1994) చిత్రం కామెడీ జోనర్‌లో కల్ట్ క్లాసిక్‌గా మిగిలిపోయింది. ఈ చిత్రంలో అమర్, ప్రేమ్ పాత్రల్లో అమీర్‌ఖాన్, సల్మాన్‌ఖాన్ పండించిన హాస్యం అందరినీ అలరించింది. రాజ్‌కుమార్ సంతోషి ఈ చిత్రాన్ని దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమాకు సీక్వెల్ కోసం రంగం సిద్ధమవుతున్నదని అమీర్‌ఖాన్ వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ‘దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి సీక్వెల్‌కు స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నాడు. కొద్దిరోజుల్లోనే ఈ సీక్వెల్‌పై మరింత స్పష్టత వస్తుంది’ అని అమీర్‌ఖాన్ పేర్కొన్నారు.



## పూర్వ వైభవం కోసం పూజాహెగ్డే..

అగ్ర కథానాయిక పూజాహెగ్డేకు గత రెండేళ్లుగా అంతగా కలిసి రావడం లేదు. తెలుగులో ‘అల వైకుంఠపురములో’ తర్వాత ఒక్క విజయాన్ని దక్కించుకోలేకపోయింది. కెరీర్ వరుస వైఫల్యాలతో కొనసాగుతున్నా ఏ మాత్రం ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా తిరిగి పూర్వ వైభవాన్ని సాధిస్తాననే ధీమాతో ఉంది పూజాహెగ్డే. తాజా సమాచారం ప్రకారం ఈ భామ రెండు భారీ ప్రాజెక్ట్‌లలో భాగం కానున్నట్లు తెలిసింది. ‘పుష్ప 2’ చిత్రం తర్వాత అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొస్తున్నాయి. బన్నీకి కథ చెప్పానని, ఇద్దరి మధ్య చర్చలు జరుగుతున్నాయని అట్లీ ఓ సందర్భంలో తెలిపారు. ఈ సినిమాలో పూజాహెగ్డే కథానాయికగా నటించనుందని తమిళ మీడియాలో వార్తలొస్తున్నాయి. ఇక మరో సినిమా విషయానికొస్తే... నందినీ రెడ్డి దర్శకత్వంలో సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. తొలుత ఇందులో సమంతను నాయికగా అనుకున్నారట. అయితే ప్రస్తుతం ఆమె సినిమాలకు బ్రేక్ తీసుకోవడంతో ఆమె స్థానంలో పూజాహెగ్డేను కథానాయికగా ఎంపిక చేసే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఒకవేళ ఈ రెండు సినిమాల్లో పూజాహెగ్డే నాయికగా ఖరారైతే కెరీర్ తిరిగి పుంజుకుంటుందని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు.



## అచ్చుమైన సొగసు వేదిక సొంతం!

తూరుపు వేదిక సూర్యుడి సొంతం. అచ్చమైన సొగసు మాత్రం నటి వేదిక సొంతం! గులాబీ రంగు స్కర్ట్, లాంగ్ కోట్‌లో లేత రోజాలా మెరిసిపోతున్నది. పింకు వన్నె దుస్తుల్లో బింకం ప్రదర్శిస్తూ ఫొటోలకు ఇలా పోజిచ్చింది ఈ తార. రజాకార్ చిత్రంలో నటించిన వేదిక నయా లుక్‌లో కనువిందు చేస్తుంటే... అప్పుడెప్పుడో ‘ముని’ సినిమాలో మెరిసిన వైనాన్ని గుర్తుచేస్తున్నట్టు ఉంది కదూ...

## ‘పెద్ది’గా రామ్‌చరణ్?



రామ్‌చరణ్ సినిమా అంటేనే విడుదలకు ముందు హైప్ కామన్. దానికితోడు ‘ఉప్పెన’ లాంటి బ్లాక్‌బాస్టర్ హిట్ ఇచ్చిన బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్‌చరణ్ సినిమా అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ప్రస్తుతం ఈ సినిమా ఆప్‌డేట్స్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు చెందిన ఓ వార్త సాంఘిక మాధ్యమాల్లో జోరుగా వినిపిస్తున్నది. వివరాల్లోకెళ్తే.. రామ్‌చరణ్, బుచ్చిబాబు కలయికలో వస్తున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్‌కు ‘పెద్ది’ అనే పేరును ఖరారు చేసినట్టు ఆ వార్త సారాంశం. నిజానికి ఈ టైటిల్‌ని ఎన్టీయార్ సినిమాకోసం బుచ్చిబాబు రిజిస్టర్ చేయించారు. ఇప్పుడు అదే పేరును చరణ్ సినిమాకు వాడుతున్నట్టు తెలుస్తున్నది. అయితే.. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సివుంది. ఇదిలావుంటే.. ఈ నెల 20న లాంఛనంగా పూజా కార్యక్రమం నిర్వహించి, ఈ సినిమాకు చెందిన పూర్తి వివరాలను నిర్మాతలు ప్రకటించనున్నారట. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకటసతీశ్ కిలారు నిర్మించనున్న ఈ సినిమాకు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారు. జాన్వి కపూర్ ఇందులో కథానాయిక. విజయ్‌సేతుపతి విలన్‌గా నటిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com